# సంస్కరణలు



**ఎం. ఎస్. మూర్తి**

'శేషయ్యా !'

'ప్రభూ !'

'ఈ వేళ నా మనసులో ఏదో చెప్ప రాని ఆవేదనగా వుంటుందోయ్—'

'ఒక షోడాకాయ తెప్పించమం టారా?'

'ఛ ! సోడాకాయకీ మనసుకీ సంబం ధమేమిటీ ?'

'అలా అనబోకండి—మనసులోని ఆవేదనలకు కారణాలు సాధారణంగా భౌతికమైనవే అయి వుంటాయి—'

'శేషయ్యా, చూడూ—?'

'..........'

'తూర్పున ఆ కారుమబ్బులా కదలి వస్తూన్న దేమిటీ_శత్రుసైన్యాలా ?'

'కాదండి—గొర్రెలమంద !'

'ఎన్ని గొర్రెలు ! అవన్నీ గొర్రెలే నటోయ్ ?'

'చిత్తం !'

'మహాసముద్రంలావుంది ఆ మంద!'

'చిత్తం—అలానేనండి—గొర్రెజాతి చాలా అభివృద్ధిలో వుంది—'

'శేషయ్యా !'

'ప్రభూ !'

'నాకేదో దిగులుగా వుందోయ్—శత్రువులు గానీ వాటిని మనమీదకు దండెత్తించడం లేదు గదా ?'

'మీకు అటువంటి భీతి కలలోకూడా వొద్దండి—అవన్నీ మన సంస్థానపు గొర్రెలే !'

'మన సంస్థానానికి చెందినవే ?'

'చిత్తం ! ముమ్మాటికీ !'

'మన సంస్థానంలో అన్ని గొర్రె లున్నాయా ?.

'ఉన్నాయండి. ప్రభువుల వారి

హయాంలో అవన్నీ దినదిన ప్రవర్ధమానంగా వుంటున్నాయండి—'

'ఇన్నాళ్లనుంచీ చెప్పేవుకాదేమోయి, మన సంస్థానంలో ఇన్ని గొర్రెలుంటూంటే ?'

'చిత్తం ! తమకు తెలియని విషయమా అని చెప్పటానికి సాహసించలేదండి—'

'శేషయ్యా !'

'అయ్యా ?'

'ఇకముందు ఇలాంటి ఉపేక్షలు పనికిరావు నావద్ద—'

'చిత్తం ! ప్రభువులు ఏం చెయ్యమంటే అది చేస్తాను—'

'నేను చెప్పేకనా చెయ్యటం ?'

'పొరబాటేనండి—లెంపలు వేసుకుంటున్నా—ఇకనుంచి తమరు చెప్పకపూర్వమే తమ ఆంతర్యం గ్రహించుకుని మరీ ప్రవర్తిస్తూంటానండి ?'

'రైట్ !'

'మహాప్రసాదం !'

'ఇన్ని గొర్రెలు ! ఇన్ని గొర్రెలు ! రకరకాల గొర్రెలు, రంగురంగుల గొర్రెలు, బుల్లిగొర్రెలు, పెద్దగొర్రెలు... ఇన్ని వుంటూంటే ఇన్నాళ్లూ తెలియనేలేదు...'

'పొరబాటే చేశానండి !'

'చూడ ముచ్చటైన జంతువులు కాదటోయ్ ఈ గొర్రెలూ ?'

'అవునండి— చూడముచ్చటైనవే !'

'చూడూ, ఆ మంద పూరును సమీపిస్తున్నట్టగా వుంది—'

'అవునండి !'

'ఎంత రమ్యమైన దృశ్యం ! తీరుతీరుల జంతువులు, ఇంపైన నడక—ఒక్కటికూడా గుంపులోనుంచి తప్పించుకుని పోవటం లేదోయ్ !'

'చిత్తం ! వాటిస్వభావమే అంతండి!'

'మన మనషులకన్నా చాలా తెలివైనవిలా కనిపిస్తాయి—మన వెధవల్ని నలుగుర్ని అలాగ బారుతీరి నడవమంటే కాలుకుంటే వాడొకడూ, మడత కాలెత్తేసేవాడొకడూ,ఎవరూ చూడకుండాపక్కసందుల్లోకి దాటుకుపోయేవాడొకడూ—ఛస్ !'

'అంతేనండి !'

'గొర్రెకి వున్నంత బుద్ధికూడా లేకపోతే వీళ్లకి......!'

'అవునండి ! అంతేనండి !'

'అవి చూడూ—ఎంత స్వేచ్ఛగా, ఎంత ఉత్సాహంగా, ఎంత హాయిగా మందలో వడి వస్తున్నాయో ?'

'అవి అంతేనండి ! మనుషులకి మల్లే తిరుగుబాటు చెయ్యవు !'

'శేషయ్యా !'

'అయ్యా !'

'ఈ గొర్రెలను చూస్తున్నకొద్దీ వాటికేదో చెయ్యాలని బుద్ధి పుడుతుందోయ్ !'

'చిత్తం, ఏం చేద్దామండీ ?'

'చూడూ, ఆ మందను తోలుకొచ్చే వాడితో వాటినన్నింటినీ మనకోటలోనికి తోలమని చెప్పు ?'

'చెబుతానండి—చెప్పిన పిమ్మట ?'

'ఆ గొర్రెలనన్నిటినీ మనమే ఎంతో బాగా పెంచుకుందాం—ఇంత మంచి జంతువులను !'

'బాగానే వుందండి !'

'మన ఆస్థానంలో బలుస్తూండే కవులకన్నా పండితులకన్నా తీసిపోయాయేమిటవీ !'